సాక్షి
నల్లగొండ
ఆదివారం । 25 । జూన్ । 2023



శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం
మట్టపల్లి మహాక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణాన్ని శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. -10లో



బాలల రక్షణే ప్రభుత్వ ధ్యేయం
బాలల రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు అంజన్‌రావు అన్నారు. -10లో

గరిష్ఠం/కనిష్ఠం
29°/25°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

27న గ్రూప్-4 అభ్యర్థులకు అవగాహన

రామగిరి(నల్లగొండ) : టీఎస్‌పీఎస్సీ గ్రూప్ - 4, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 27న ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి నంద పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.meet.google.com/cog-vbjv-ksj లింక్ ద్వారా సదస్సులో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 70956 12963, 90302 06741 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

నల్లగొండ టౌన్ : ఐసీడీఎస్ పరిరక్షణకు అంగన్‌వాడీ ఉద్యోగులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.విజయలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడిచినా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కరించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, మెస్ చార్జీల బిల్లులను వెంటనే చెల్లించాలని, ఈఎస్ఐ, పింఛన్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, బాణాల పరిపూర్ణచారి, దండెంపల్లి సత్తయ్య, నారబోయిన శ్రీనివాస్, అద్దెంకి నర్సింహ, కె.విజయలక్ష్మి, పార్వతి, నాగమణి, ప్రమీల, రత్నకుమారి, ప్రకృతాంబ, రూప, వాణి తదితరులు పాల్గొన్నారు.

సగటున 15.4 మి.మీ వర్షపాతం నమోదు

నల్లగొండ అగ్రికల్చర్ : నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలో 15.4 మిల్లీ మీటర్లు సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా శాలిగౌరారం మండలంలో 42.9 మిల్లీమీటర్లు, నార్కట్‌పల్లి, కట్టంగూర్ 36.3, మునుగోడు 34.0, గుండ్లపల్లి 33.9, నకిరేకల్ 29.9, తిప్పర్తి 26.3, కనగల్ 24.9, కేతేపల్లి 23.4, దామరచర్ల 22.8, నల్లగొండ 22.7, చందంపేట 14.9, దేవరకొండ 12.9, మిర్యాలగూడ 12.8, గుర్రంపోడు 12.3, మాడ్గులపల్లి 11.9, నేరెడుగొమ్ము 10.3, చిట్యాల 9.9, చండూర్ 9.8, వేములపల్లి 8.4, నిడమనూర్ 7.9, కొండమల్లేపల్లి 5.9, అనుముల 5.0, నాంపల్లి 4.1, త్రిపురారం 3.9, మర్రిగూడ 3.4, పెద్దవూర 3.1, పీఏపల్లి 3.0, చింతపల్లి 2.1, అడవిదేవులపల్లి 1.5, తిరుమలగిరిసాగర్ మండలంలో 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నిలిచిన మంచినీటి సరఫరా

కట్టంగూర్ : నల్లగొండ మండలం దండంపల్లి గ్రామ సమీపంలో ఉన్న కాలువ వద్ద కల్వర్టు కూలడంతో మంచినీటి సరఫరా శనివారం నిలిచిపోయింది. దండెంపల్లి దగ్గర కాల్వ సైడ్ వాల్ కుంగిపోవడంతో పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ 450 ఎంఎం, 600 ఎంఎం పైప్‌లైన్ ధ్వంసమైంది. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు, అడ్డగూడూరు, నల్లగొండ జిల్లాలోని కట్టంగూర్, శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి మండలాలకు నీటి సరఫరా నిలిచిపోయినట్లు మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. ఈనెల 30 వరకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోనుంది.

ఖైదీలకు వైద్య పరీక్షలు



ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నల్లగొండ క్రైం : జిల్లా జైల్‌లో ఖైదీలకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది ఖైదీల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు, జైల్ సూపరింటెండెంట్ దేవ్లానాయక్, జైలర్ జనార్దన్‌రెడ్డి, శోభన్‌బాబు, చక్రవర్తి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వారానికి ఒక్కరోజు..

పల్లె నాడి పడదాం!

- వినూత్న కార్యక్రమానికి ఐఎంఏ నీలగిరి శాఖ శ్రీకారం
- 18 పల్లెలను దత్తత తీసుకున్న వైద్యులు
- పేదలకు వైద్య సేవలు అందించనున్న డాక్టర్లు
- సొంత ఖర్చులతోనే మందుల పంపిణీ
- నేడు పెద్దసూరారంలో కార్యక్రమం ప్రారంభం





సమాజ సేవలో మేము సైతం అంటూ వైద్యులు పల్లెబాట పడుతున్నారు. వారంలో ఒక్క రోజు గ్రామాల్లో పేదలకు వైద్య సేవలు అందించాలని నిర్ణయించుకున్నారు. ఇందు కోసం నల్లగొండ పరిసరాల్లోని 18 గ్రామాలను దత్తత తీసుకున్నారు. వైద్యమే కాదు యువతకు, విద్యార్థులకు మార్గదర్శకులుగా మారనున్నారు.

నేడే శ్రీకారం..
ఐఎంఏ తలపెట్టిన రండి గ్రామాలకు పోదాం కార్యక్రమాన్ని ఐఎంఏ ప్రతినిధులు ఆదివారం నల్లగొండ మండలం పెద్ద సూరారం గ్రామంలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. దత్తత తీసుకున్న గ్రామాలకు ఆయా డాక్టర్లు వెళ్లి వైద్య సేవలు అందించనున్నారు. దత్తత తీసుకున్న గ్రామాల్లో ఏడాదిపాటు వైద్య సేవలను అందించిన అనంతరం ఇతర గ్రామాలను దత్తత తీసుకోనున్నారు.

నల్లగొండ టౌన్ : నిత్యం ఆస్పత్రిలో బిజీబిజీగా ఉండే నీలగిరి డాకర్లు ఒక వినూత్న కార్యక్రమానికి నడుం బిగించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నీలగిరి శాఖ ఆధ్వర్యంలో 'రండి..పల్లెకు పోదాం - దత్తత తీసుకుందాం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డాక్టర్లు పల్లె ప్రజల వద్దకు వెళ్లి వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు అందించనున్నారు. ఏడాదిపాటు వారానికి ఒక రోజు వైద్యులు తాము దత్తత తీసుకున్న గ్రామాలకు వెళ్లి బీపీ, షుగర్, గుండె జబ్బులు, ఇతర సీజన్ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. పట్టణాల్లో మురికివాడలను కూడా దత్తత తీసుకోనున్నారు.

డాక్టర్ పేరు	దత్తత తీసుకున్న గ్రామం		
సుచరిత	చెర్లగౌరారం	వసంత	పానగల్
గౌరిశ్రీ	చెట్ల చెన్నారం	రామ్మోహన్	ముషంపల్లి
రాజేశ్వరి	పెద్దసూరారం	హరికృష్ణ	ఖాజీరామారం
లీలావతి	తేలకంటిగూడెం	శిశుపాల్‌రెడ్డి	కనగల్
పుల్లారావు.	ఇరుగంటిపల్లి	సంతోష్‌రెడ్డి	పులిమామిడి, మారెపల్లి
అనితారాణి		కృష్ణచైతన్య	అన్నెపర్తి
విఠల్	ఊకొండి	శశాంక్	యడవెల్లి
శ్రీకాంత్‌వర్మ	రామలింగాలగూడెం	వెంకట్‌రెడ్డి	దుప్పలపల్లి
రమేష్	సపావత్ తండా	ప్రవీణ్	చర్లపల్లి

వ్యాధులపై అవగాహన..
గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్యం, ఆహార అలవాట్లు, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులపై సరైన అవగాహన లేకపోవడంతో అనారోగ్యం బారిన పడుతున్నారని ఐఎంఏ అభిప్రాయ పడుతోంది. పల్లె ప్రజలు ముఖ్యంగా మహిళలు, బాలికలు రక్తహీనతతో బాధపడుతుంటారు. వారంతా ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లు, పరిశుభ్రత, లైంగిక వేధింపులు, భ్రూణ హత్యలు, మహిళలపై వివక్ష తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు సైతం నిర్వహించనున్నారు.

యువతకు మార్గదర్శకం..
డాక్టర్లు తామ దత్తత తీసుకున్న గ్రామాల్లో వైద్య సేవలు అందించడంతోపాటు యువత, విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, సైకిళ్లు, యూనిఫాం పంపిణీ చేయనున్నారు. పూర్తిగా తమ సొంత ఖర్చులతో నిర్వహించే ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, స్థానిక యువత, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, గ్రామీణ వైద్యుల సహకారం తీసుకోకున్నారు.

ఉద్యమంలా నిర్వహిస్తాం



రండి పల్లెకుపోదాం - దత్తత తీసుకుందాం కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహిస్తాం. పట్టణాలకు వచ్చి వైద్యం చేయించుకోలేని పేదల చెంతకు వైద్యాన్ని తీసుకుపోవడమే మా లక్ష్యం. దత్తత తీసుకున్న గ్రామాల్లో వైద్య సేవలనుఅందిస్తాం.
– డాక్టర్ సుచరిత, ఐఎంఏ అధ్యక్షురాలు

సామాజిక సేవ కూడా చేస్తాం



గ్రామీణ పేదలకు ఉచితంగా వైద్య సేవలను అందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తాం. విద్యార్థులు పుస్తకాలు, సైకిళ్లు, యూనిఫాం అందిస్తాం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై యువతకు అవగాహన కల్పిస్తాం.
– డాక్టర్ గౌరీశ్రీ, ఐఎంఏ కార్యదర్శి

1747 పోలింగ్ కేంద్రాలు

- అసెంబ్లీ ఎన్నికల కసరత్తు వేగవంతం
- జూలై 7న పూర్తికానున్న ఈవీఎంల మొదటి దశ చెకింగ్
- అక్టోబరు 4 తుది ఓటరు జాబితా



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల కసరత్తు వేగంగా సాగుతోంది. ఆరు నియోజకవర్గాల్లో 1,747 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేలా జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం) పరిశీలనకు సంబంధించిన పనులను చేపట్టింది. ఇప్పటికే మొదలుపెట్టిన ఈవీఎం మొదటి దశ పరిశీలన జూలై 7వ తేదీతో ముగియనుంది. అదనపు కలెక్టర్ భాస్కర్ రావు నేతృత్వంలో ఈసీఐఎల్‌కు చెందిన 15 మంది ఇంజనీర్ల బృందం ఈవీఎంల మొదటి దశ పరిశీలన పనులు చేస్తోంది. గత ఎన్నికల్లో వినియోగించిన బీహెచ్‌ఈఎల్‌కు చెందిన ఈవీఎంలను మహారాష్ట్రకు పంపించగా, వచ్చే ఎన్నికల్లో ఈసీఐఎల్‌కు చెందిన ఈవీఎంలను వినియోగించనున్నారు.

ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	ఓటర్లు
దేవరకొండ	2.29.923
నాగార్జునసాగర్	2.19.674
మిర్యాలగూడ	2.12.316
నల్లగొండ	2.26.991
మునుగోడు	2.42.102
నకిరేకల్	2.35.896
మొత్తం	13.66.902

3,766 బ్యాలెట్ యూనిట్లు
ఆరు నియోజకవర్గాల్లో 1,747 పోలింగ్ కేంద్రాల కోసం 3,766 బ్యాలెట్ యూనిట్లు, 2,913 కంట్రోల్ యూనిట్లు, 2,864 వీవీ ప్యాట్‌లను సిద్ధం చేస్తోంది. ఒక్కో పోలింగ్ కేంద్రంలో వాస్తవ అవసరం కలుపుకొని 125 శాతం బ్యాలెట్ యూనిట్లను, 125 శాతం కంట్రోల్ యూనిట్లను, 135 శాతం వీవీ ప్యాట్‌లను, శిక్షణ, ఇతర అవసరాల కోసం 10 శాతం రిజర్వులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పెరిగిన ఓటర్లు
జిల్లాలో గత నెలలో ప్రకటించిన ఓటర్ల సంఖ్యతో పోల్చితే ప్రస్తుతం పెరిగింది. గత నెలలో 13,65,478 మంది ఓటర్లు ఉండగా, శనివారం నాటికి 13,66,902కు పెరిగింది. ఇంకా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. వచ్చే నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకునే వారితో కలుపుకొని ఆగస్టు 2వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. ఆ రోజు నుంచి 31వ తేదీ వరకు వాటిపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. సెప్టెంబరు 22వ తేదీ వరకు వాటిని పరిశీలించి అక్టోబరు 4వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చండూరులో మాట్లాడుతున్న ద్వారక్

చండూరు : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ ద్వారక్ పేర్కొన్నారు. చండూరులో శనివారం నిర్వహించిన చేనేత కార్మికులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు చేనేత చేయూత, చేనేత మిత్ర, బీమా, చేనేత క్లస్టర్, పావలా వడ్డీ, క్యాష్ క్రెడిట్, జియో టాగ్ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీడీ జి.నాగలత, ఏడీ బిచ్చప్ప, డీఓ జాజుల రంజిత్, ఏడీఓ గోపాల్, సీడీఈ మీనాక్షి, జూలూరు శ్రీనివాసులు, కర్నాటి శ్రీనివాసులు, రావిరాల ఓంకారం, చిట్టిపోలు వెంకటేశం, పున్న భిక్షమయ్య, కర్నాటి సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెకు దిగుతాం..



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

నల్లగొండ టౌన్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే జూలై 6 నుంచి నిరవధిక సమ్మెకు దిగాల్సి వస్తుందని గ్రామపంచాయతీ కార్మిక యూనియన్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యజ్ఞనారాయణ, చైర్మన్ సీహెచ్ లక్ష్మీనారాయణలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమ్మె నోటీసు ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ పిలుపుమేరకు శనివారం మేకల అభినవ్ స్టేడియం నుంచి ఎన్జీ కళాశాల వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, అర్హత గల వారిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ఆర్‌కె.నాయుడు, ప్రధాన కార్యదర్శి పోతెపాక వినోద్‌కుమార్, ఏర్పుల యాదయ్య, సత్యనారాయణ, పెంజర్ల సైదులు, దయానంద్, ముత్యాలు, అంజయ్య, నర్సింహ, జహీర్, సర్వయ్య, వెంకన్న, యాదమ్మ, వైష్ణవి, స్వప్న, యాదగిరి, నాగరాజు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..



మునుగోడులోని విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ శ్రీనివాస్‌గౌడ్

మునుగోడు : ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా డబ్బులు తీసుకొని విత్తనాలు విక్రయించే వ్యాపారుల లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. యూ ఎస్ 7067 పత్తి విత్తనాలను ఓ డీలర్ అధిక ధరకు విక్రయించడంపై శనివారం 'సాక్షి'లో 'డీలర్ చెప్పిందే రేటు?' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఏఓ స్పందించి ఆ కంపెనీ డీలర్ దుకాణంలో తనిఖీలు చేశారు. ప్రస్తుతం ఆ దుకాణంలో ఆ కంపెనీకి చెందిన విత్తన ప్యాకెట్లు 130 ఉన్నాయని, వాటిని ఎంఆర్‌పీకి విక్రయించాలని సూచించారు. ఏఈఓను ఆ దుకాణంలో కూర్చోబెట్టి విత్తనాలు విక్రయించేలా ఏర్పాట్లు చేస్తామని ఏఓ తెలిపారు. అధిక ధరకు విక్రయిస్తున్న విషయంలో తాను సిద్ధం చేసిన నివేదికను జిల్లా వ్యవసాయ అధికారికి సమర్పిస్తానని పేర్కొన్నారు.

కొందరు డీలర్లకు మాత్రమే ఎందుకో?
యూఎస్ 7067 అనే పత్తి విత్తనాల కంపెనీ గతంలో ప్రతి మండలంలో ఇద్దరు ముగ్గురికి డీలర్‌షిప్ ఇచ్చేది. కానీ, ఈ ఏడాది మాత్రం జిల్లా వ్యాప్తంగా ఐదుగురు డీలర్లకు మాత్రమే విత్తనాలను సప్లయ్ చేస్తోంది. దీంతో ఆ ఐదుగురు డీలర్లు ఆ విత్తన ప్యాకెట్లను బ్లాక్‌చేసి అధిక ధర చెల్లించిన వారికి మాత్రమే విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ అధికారి శనివారం ఆ కంపెనీ నిర్వాహకులను వివరణ ఇవ్వాలని కోరినట్లు తెలిసింది.

అపరిశుభ్రత పై అధికారుల కొరడా

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని మిఠాయి దుకాణం, ఓ రెస్టారెంట్‌లో అపరిశుభ్రత, ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై మున్సిపల్ అధికారులు కొరడా ఝళిపించారు. బార్ అండ్ రెస్టారెంట్‌కు రూ.3 వేలు, మిఠాయి దుకాణానికి రూ.10 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ మాట్లాడుతూ ఆహార పదార్థాలు విక్రయించే హోటల్స్, మిఠాయి దుకాణాలు, ఇతర తోపుడు బండ్ల వారు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజాఅలీ, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



కొప్పోలులో మహిళలతో కలిసి పాదయాత్ర చేస్తున్న విక్రమార్క



పాదయాత్రలో చిన్నారిని ఎత్తుకున్న భట్టి

కేతేపల్లి : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వటంతో పాటు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం కేతేపల్లి మండలంలోని కొప్పోలు గ్రామం నుంచి భీమారం మీదుగా సూర్యాపేట జిల్లాలోకి వెళ్లింది. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ సమస్యలు తెలుసుకుంటూ హామీలతో భరోసా కల్పిస్తూ ముందుకు సాగారు. పలు చోట్ల భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వచ్చాక ఇల్లు లేని ప్రతి కుటుంబానికి రెండు గదుల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు ఇస్తామని చెప్పారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య, పీసీసీ నేత దైద రవీందర్, ఎండీ.యూసుఫ్‌జానీ, వేదాసు శ్రీధర్, కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, ఎంపీటీసీ బడుగుల రవీందర్, కె.శ్రీనివాస్‌యాదవ్, బడుగుల మురళయ్య, బడుగుల చంద్రశేఖర్, గార్లపాటి రవీందర్‌రెడ్డి, గాజుల సుకన్య, గుండా జలంధర్‌రెడ్డి, గుణగంటి రాజు, బయ్య ముత్తయ్య, సైదులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటూ ముందుకు..
సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క రోడ్డు వెంట నిల్చుని ఉన్న కూలీలు, వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలుకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొప్పోలులో మహిళలు లింగమ్మ, కళమ్మ, యానమ్మ, రాములమ్మ ఆయనకు ఎదురొచ్చి సమస్యలు విన్నవించుకున్నారు. మీరు అధికారంలోకి రాగానే పేదల సమస్యలన్నీ పరిష్కరించాలని చేతులు జోడించి వేడుకున్నారు. గ్రామంలో చెట్టుకింద నిర్వహించిన రచ్చబండలో ప్రజలు అనేక సమస్యలను భట్టి దృష్టికి తీసుకొచ్చారు. ఇల్లు, రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు లేదని.. మేమెట్టా బతకాలంటూ చింతమళ్ల లక్ష్మి కన్నీళ్లు పెట్టుకుంటూ చెప్పుకుంది. తనకు పింఛన్ రావడం లేదని మీరైనా ఇప్పించాలని వృద్ధ మహిళ జయమ్మ కోరింది. కేసీఆర్ రుణమాఫీ చేస్తానని చెప్పడంతో బ్యాంకుల్లో వడ్డీ కట్టలేదని, దీంతో ఎగవేతదారులుగా బ్యాంకులు ప్రకటిస్తే అధిక వడ్డీకి తెచ్చి బ్యాంకు రుణం తీర్చామని పలువురు రైతులు వాపోయారు. కొప్పోలు శివారులో గొర్రెలు కాసుకుంటున్న సత్తయ్య, బంగారయ్య భట్టితో ముచ్చటించారు. గొర్రెల పథకం కింద తమకు గొర్రెలు ఇవ్వలేదని ఈ సందర్భంగా వారు భట్టి దృష్టికి తీసుకొచ్చారు.

జూలై 6వ తేదీ వరకు బడిబాట

రామగిరి (నల్లగొండ) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు జూన్ 26 నుంచి జూలై 6వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ రెండవ విడత బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బడి ఈడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించాలని పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ బడి బాటలో పాల్గొంటారని తెలిపారు.

26 నుంచి పఠనోత్సవం..
పాఠశాలల్లోని విద్యార్థులు ధారాళంగా చదవడానికి, చదివింది అర్థం చేసుకోవడానికి జూన్ 26 నుంచి జూలై 31వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లో పఠనోత్సవం నిర్వహిస్తున్నామని డీఈఓ తెలిపారు. ప్రతి పాఠశాలలో ఒక పీరియడ్‌ను విద్యార్థులు చదవడానికి కేటాయిస్తామని.. ఈ పీడియడ్‌లో విద్యార్థి స్థాయికి అనుగుణంగా లైబ్రరీ పుస్తకాలను అందించి చదివిస్తామని తెలిపారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని రాస్తారోకో



గుర్రంపోడులో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, కాంగ్రెస్ శ్రేణులు

గుర్రంపోడు : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి.. నష్టపోయిన రైతులను న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం గుర్రంపోడు మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరుతో ఒక్కో రైతుకు క్వింటాకు పది కిలోల వరకు కోత విధించి నకిలీ రైతులను సృష్టించి వారి ఖాతాల్లోకి డబ్బులు మళ్లించారని ఆరోపించారు. మిల్లర్లతో కుమ్మక్కై కోత విధించిన ధాన్యం డబ్బులు పంచుకున్నారని.. మండలంలో సుమారు రూ. 2 కోట్ల మేర తరుగు కోత జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయిలో విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

రాస్తారోకోలో ఉద్రిక్తత
నల్లగొండ- దేవరకొండ ప్రధాన రహదారిపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు.. కాంగ్రెస్ నాయకులు, రైతులకు నచ్చజెప్పినా వినకపోవడంతో బలవంతంగా పోలీసు వ్యాన్‌లలో స్టేషన్‌కు తరలించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, సూదిని జగదీశ్వర్‌రెడ్డి, నర్సింహారావు, చనమల్ల యాదవరెడ్డి, తిరుమల్‌రెడ్డి, వెలుగు యాదయ్య, ఆవుల వెంకన్న, శ్రీనివాస్, వెంకన్న, గణేష్ నాయక్, అంబేద్కర్, నాగరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా కూలీ దుర్మరణం

వేములపల్లి, మాడుగులపల్లి: ట్రాక్టర్ అదుపు తప్పి మహిళా కూలీ మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. మాడ్గులపల్లి మండలంలోని పాములపాడు గ్రామంలో ఈ ఘటన జరిగింది. పాములపాడు గ్రామానికి చెందిన వేముల జానకిరాములు ఇంటి నిర్మాణానికి రాళ్లు తీసుకువచ్చేందుకు శుక్రవారం అదే గ్రామానికి చెందిన 8 మంది కూలీలను తన ట్రాక్టర్‌లో గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. రాయిని లోడ్ చేసుకొని వస్తుండగా మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ ఓ పక్కకు ఒరగడంతో అందులో కూర్చున్న కూలీల్లో పగిడిమర్రి సైదమ్మ (38) కిందపడగా ఆమెపై రాళ్లుపడి తీవ్రగాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం స్థానికులు సూర్యాపేట ఏరియా దవాఖానకు తరలించారు.అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ప్రమాదంలో పలువురు కూలీలకూ స్వల్పగాయాలైనట్లు తెలిసింది. మృతురాలి భర్త లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనయ్య తెలిపారు.

అభాగ్యురాలిని ఆదుకోరూ..!

- అనారోగ్యంతో భర్త మృతి
- నిలువ నీడ లేక ఇద్దరు పిల్లలతో మహిళ అష్టకష్టాలు
- సాయమందించాలని వేడుకుంటున్న దివ్యాంగురాలు

కన్నీటి గాథ

కనగల్ : ఉన్నంతలో హాయిగా బతికిన కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చింది. మాయదారి రోగం ఇంటిపెద్దను కబళించగా ఇద్దరు పిల్లలను సాక లేక దివ్యాంగురాలైన ఆ మహిళ అష్టకష్టాలు పడుతోంది. మనసున్న మారాజులు ఆదుకోవాలని అభ్యర్థిస్తోంది. కనగల్ మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన లింగయ్య–మణెమ్మలకు మొదటి కుమారుడు గుండెబోయిన రవీందర్ (36) వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉన్న దాంట్లోనే సర్దుకుని భార్య అనిత, ఇద్దరు కుమార్తెలను సాకుతూ జీవనం సాగిస్తున్నాడు.


భార్య, ఇద్దరు కుమార్తెలతో రవీందర్(ఫైల్)

క్యాన్సర్ బారిన పడి..

రవీందర్ ఏడాది క్రితం అనారోగ్యం బారిన పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధారించారు. క్రమక్రమేణ రవీందర్ ఆరోగ్యం క్షీణించిపోవడంతో 6నెలలుగా మంచానికే పరిమితం అయ్యాడు. వైద్యం కోసం రవీందర్ భాగానికి వచ్చిన అర ఎకరం భూమి అమ్మడంతో పాటు రూ. లక్షలు అప్పు చేసినా ప్రాణం దక్కలేదని అనిత వాపోతోంది. రవీందర్ మృతితో భార్య అనిత తన ఇద్దరి చిన్న పిల్లలతో రోడ్డున పడింది. ఉండటానికి ఇల్లు, కూడు, గూడు ఎట్లా అని రోదిస్తోంది. కష్టం చేసుకునేందుకు శరీరం సహకరించడం లేదని, ఇద్దరు పిల్లలను సాకేదెట్లా అంటూ కన్నీటి పర్యంతమవుతోంది.

రవీందర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

రవీందర్ మృతితో రోడ్డున పడిన అనిత కుటుంబానికి సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఉండటానికి ఇల్లు, పిల్లల చదువుల ఖర్చులు అందించాలని వేడుకుంటున్నారు. సహాయం చేయదలిచిన వారు 9948295832 ఈ నంబర్‌కు ఫోన్‌పే,గూగుల్ పే చేసి నిరుపేద కుటుంబానికి అండగా ఉండాలని అభ్యర్థిస్తున్నారు.

యాదాద్రి కలెక్టర్‌కు హైకోర్టు నోటీసు

సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి కోర్టు ధిక్కార కేసులో హైకోర్టు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తమ ఆదేశాలు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణ నాటికి కలెక్టర్ నేరుగా గానీ, తన న్యాయవాది ద్వారా గానీ వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను జూలై 14కు వాయిదా వేసింది. సికింద్రాబాద్‌కు చెందిన నర్సింగ్‌రావుకు యాదగిరిగుట్ట మండలం సైదాపూర్‌లో సర్వే నంబర్ 119/ఏఏ/1లో ఐదు ఎకరాల భూమి ఉంది. దీనికి సేల్‌డీడ్ డాక్యుమెంట్ కూడా ఉంది. అయితే, కొత్త పాస్‌పుస్తకాలు ఇచ్చే సమయంలో ఇది 'నిషేధిత' జాబితాలోకి వెళ్లింది. దీనిపై కలెక్టర్‌కు దరఖాస్తు చేయగా కలెక్టర్ ఆ దరఖాస్తును తిరస్కరించారు. దీంతో నర్సింగ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. దరఖాస్తును ఎందుకు తిరస్కరించారో తెలియజేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. 8 వారాలు గడువు ఇచ్చింది. కోర్టు ఇచ్చిన గడువు ముగిసినా ఎలాంటి కారణం తెలియజేయకపోవడంతో నర్సింగ్‌రావు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. అధికారులు కావాలనే కోర్టు ఆదేశాలు పాటించడం లేదని పేర్కొన్నారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీచేసింది.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- రూ. 60.50 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ వెంకట్‌రెడ్డి

భువనగిరి : చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.60.50లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ వెంకట్‌రెడ్డి శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బొమ్మలరామారం మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన ధరావత్ బిచ్చాలు ఇటీవల తన కుటుంబ అవసరాల కోసం భూమిని విక్రయించగా వచ్చిన రూ. 60.50 లక్షలను గోనె సంచిలో పెట్టి ఇంట్లోని బాత్‌రూమ్‌లోని సజ్జపైన దాచిపెట్టాడు. విషయం తెలిసిన బిచ్చాలు తమ్ముని కొడుకు ధరావత్ వినోద్ ఎలాగైన ఆ డబ్బులు దొంగిలించాలని అవకాశం కోసం ఎదురు చూశాడు. ఈ నెల 22న బిచ్చాలు నాయక్ ఇంటిలోని బాత్ రూమ్‌ను మరమ్మతులు చేసేందుకు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు పనులను అప్పగించాడు. ఈ క్రమంలో బిచ్చాలు భార్య అండాలు పనివారితో పనులు చేయిస్తుండగా ఇంటి యాజమాని తన కూతురు, అల్లుడుతో కలిసి తమ పనుల కోసం బయటకు వెళ్లారు. గమనించిన వినోద్ ఇంట్లోకి వెళ్లాడు. ఇంట్లో పనిచేస్తున్న పనివాళ్లతో పాటు పెద్దమ్మతో మాట్లాడుతూ డబ్బులు దాచిన విషయాన్ని తెలుసుకున్నాడు. ఈ సమయంలో పనుల్లో మునిగిపోయిన వారిని గమనించి బాతు రూమ్‌లోకి వెళ్లి దాచిపెట్టిన డబ్బుల సంచిని తీసుకొని వెళ్లాడు. అదే రాత్రి డబ్బులు పోయినట్లు గమనించిన బిచ్చాలు కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 23న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా ఫిర్యాదుదారులు అనుమానం వ్యక్తం చేసిన తమ్ముని కొడుకు వినోద్‌ను పట్టుకుని విచారించగా నేరం అంగీకరించాడు. డబ్బులను అదే రోజు భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలో ఉన్న అత్తగారింటికి వెళ్లి అక్కడ అత్త, బావమరిది సహాయంతో ఇంట్లో డబ్బుల మూటను గుంత తీసి పాతి పెట్టినట్లు ఒప్పుకోవడంతో వెంటనే అక్కడికి పోలీసులు వెళ్లి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దొంగతానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

సుపారీ కేసులో మరో ఇద్దరి రిమాండ్

కోదాడ: మూడు రోజుల క్రితం కోదాడకు చెందిన గేట్ కళాశాల కరస్పాండెంట్ బుద్దే కాంతారావును హత్య చేయడానికి కుట్ర పన్ని రు. 50 లక్షలతో సుపారీ గ్యాంగ్‌తో కాంట్రాక్ట్ మాట్లాడుకున్న కేసులో మరో ఇద్దరిని శనివారం కోదాడ పోలీసులు కోర్టుకు రిమాండ్ చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు రిమాండ్ అయిన వారి సంఖ్య 9కి చేరుకుంది. మరో ముగ్గురు పరారీలోనే ఉన్నారు. నిందితులైన బాదే అంజనేయులు, బాదే రాజారావులను అరెస్టు చేసి కోదాడ కోర్టుకు హాజరుపరచడంతో వారికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితులలో ఒకరైన నీలా సత్యనారాయణ మూడు రోజుల క్రితం రిమాండ్ చేసిన సమయంలో గుండెనొప్పి వచ్చిందని చెప్పడంతో ఆయనను హైదరాబాద్‌కు తరలించిన విషయం విదితమే.

మంత్రిని కలిసిన బాధితులు

గేట్ కళాశాల కరస్పాండెంట్ బుద్దే కాంతారావు హత్యకు ట్రలో భాగస్వామిగా ఉన్న నీలా సత్యనారాయణ అనేక అక్రమాలకు పాల్పడి పలువురిని మోసం చేశాడని ఆరోపణలు ఉన్నాయి. అతనిపై ఇప్పటివరకు 20కి పైగా కేసులు ఉన్నా చర్యలు తీసుకోవడం లేదని, దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని పలువురు నీలా సత్యనారాయణ బాధితులు శుక్రవారం రాత్రి మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. దాదాపు 400 కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడ్డారని వారు ఆ వినతి పత్రంలో మంత్రికి ఫిర్యాదు చేశారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ఆటో డ్రైవర్ గొంతు కోసింది ఎవరు?

మోతె : గుర్తుతెలియని వ్యక్తులు మోతె మండలానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ గొంతు కోశారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో శనివారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోతె మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన పాలకూరి చినరాములు లచ్చమ్మ దంపతుల మూడవ కుమారుడు పాలకూరి మల్లయ్యగౌడ్ 15 సంవత్సరాల క్రితం బతుకుదెరువు నిమిత్తం హైదరబాద్‌కు వలస వెళ్లాడు. ఎల్‌బీనగర్, చైతన్యపురి ప్రాంతాల్లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఏడాది ఆటో యూనియన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు మల్లయ్యగౌడ్ సహచర ఆటో డ్రైవర్లకు ఇటీవల చెప్పాడు. ఈ క్రమంలో మల్లయ్యగౌడ్ ఇంటికి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. శనివారం మల్లయ్యగౌడ్ ఇంటికి వెళ్తున్న క్రమంలో దుండగులు వెంబడించి గొంతు కోసి పరారయ్యారు. ప్రస్తుతం మల్లయ్యగౌడ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆటో యూనియన్ ఎన్నికల్లో పోటీచేస్తున్నందునే ప్రత్యర్థులు దాడికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే వాచ్‌మన్ మృతి

నిడమనూరు: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణా లోపం, ట్రాక్టర్ డ్రైవర్ అధిక వేగం వెరసి నిండు ప్రాణాన్ని బలిగొన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిడమనూరు మండలంలోని తుమ్మడం వద్ద శుక్రవారం తెల్లవారుజామున నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద కాపలాగా పడుకున్న ఆకుల రాములు(66) మీదికి ట్రాక్టర్ దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందిన విషయం తెలిసిందే. తుమ్మడం గ్రామ సమీపంలో వాగుపై పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నారు. నిర్మాణం వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం, నిర్మాణం చుట్టూ జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్లనే వాచ్‌మన్‌గా విధుల్లో ఉన్న ఆకుల రాములు మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత రక్షణ చర్యలు తీసుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణం వద్ద గుర్తులు, తీసిన గొయ్యి చుట్టూ ఎర్ర రిబ్బన్‌ను ఏర్పాటు చేశారు. ప్రాణం బలైన తర్వాత కాంట్రాక్టర్ రక్షణ చర్యలు చేపట్టాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి


బీజేపీలోకి ఆహ్వానిస్తున్న బొబ్బ భాగ్యారెడ్డి

కోదాడ అర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఆ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కోదాడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలోకి వచ్చిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, దేశంలో సుపరిపాలన అందిస్తున్న మోదీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన యువకులు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి దుగ్గి వెంకటేశ్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన యువ నాయకులు రాచమడుగు నరేష్, కందరబోయిన శ్యామ్‌కుమార్‌లు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో అక్కిరాజు యశ్వంత్, బొలిశెట్టి కృష్ణయ్య, యాదారమేష్, నూకల పద్మారెడ్డి, సాతులూరి హనుమంతరావు, ఓరుగంటి పురుషోత్తం, కొండ్లే రవికుమార్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ముగ్గురికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి : ట్రాలీ ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఓ యువకుడు మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం సాయంత్రం మండల శివారులోని శ్రీమిత్ర టౌన్‌షిప్ సమీపంలో జరిగింది. పోచంపల్లికి చెందిన సెంట్రింగ్ మేస్త్రీ పబ్బాల యాదయ్య వద్ద సీతవానిగూడేనికి చెందిన కడెం అజయ్‌కుమార్(18), బండారి కార్తీక్, శేషరాజ్ పాండు, బండారి అభిలాష్, విజయ్ కూలీగా పనిచేస్తున్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇంజాపూర్‌లో సెంట్రింగ్ పనులు ముగించుకొని ట్రాలీ ఆటోలో సాయంత్రం ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో మండల శివారులో శ్రీమిత్ర టౌన్‌షిప్ సమీపంలో కల్వర్టు వద్దకు రాగానే ఆటో డ్రైవర్ బండారి అభిలాష్ సడన్‌బ్రేక్ వేయడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో ప్రయాణిస్తున్న కడెం అజయ్‌కుమార్, బండారు కార్తీక్, విజయ్‌లకు గాయాలయ్యాయి. కడెం అజయ్‌కుమార్‌కు ట్రాలీలో ఉన్న రాడ్‌లు తలకు బలంగా తాకడంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రులందరినీ చికిత్సనిమిత్తం హయాత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా అజయ్‌కుమార్ మార్గమధ్యలో మృతిచెందాడు. ఆటోలో ముందు కూర్చున్న పాండుతో పాటు డ్రైవర్ అభిలాష్ మాత్రం స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.


అజయ్‌కుమార్(ఫైల్)

ఉపాధి కోసం వస్తే ..

కడెం అజయ్‌కుమార్‌ది స్వస్థలం మహారాష్ట్రంలోని నాందేడ్. ఇతడి తండ్రి కడెం కేశవ్ ఉపాధి కోసం కుటుంబ సభ్యులతో కలిసి 12 ఏళ్ల క్రితం పోచంపల్లికి వలస వచ్చి సీతావానిగూడెంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. కేశవ్ కూలీనాలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకొనేది. కుటుంబ కలహాలతో అజయ్‌కుమార్ తల్లి పదేళ్ల క్రితం ఇంట్లో కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకొంది. అదేవిధంగా రెండేళ్ల క్రితం కడుపునొప్పి భరించలేక అజయ్‌కుమార్ అన్న కూడా ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మిగిలిన ఒక్క కొడుకు కూడా మృతి చెందడంతో తండ్రీ రోదన వర్ణణాతీతంగా మారింది.

రేషన్ బియ్యం పట్టివేత

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో ఎస్‌ఓటీ పోలీసులు శనివారం రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువుకు తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కేకేతండాకు చెందిన లావుడ్యా సురేష్ చిట్యాల ప్రాంతంలో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశా డు. బియ్యం బస్తాలను ఆటోలో వేసుకొని పటాన్‌చెరువులోని వీరేషం అనే వ్యక్తికి దిగుమతి చేసేందుకు వెళ్తున్నాడు. ఆ క్రమంలో దండుమల్కాపురం గ్రామ శివారులోకి వెళ్లగానే అప్పటికే పక్కా సమాచారం అందుకున్న భువనగిరి ఎస్‌ఓటీ పోలీసులు జాతీయ రహదారిపై వాహనాన్ని పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వలిగొండ : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని అర్రూర్ గ్రామానికి చెందిన చిలుకమర్రి సత్యం కొంతకాలంగా భూ తగాదాలతో సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలోనే మనస్తాపంతో శనివారం వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాడాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని భువనగిరి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

దాడి కేసులో ఆరుగురి రిమాండ్

చందంపేట : చందంపేట మండలం వైజాక్ కాలనీలో పర్యాటకులపై దాడి చేసిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి వైజాక్ కాలనీకి వచ్చిన ఆరుగురు టూరిస్టులపై మండలంలోని బుగ్గతండాకు చెందిన వాంకుణావత్ మంజ్య, వాంకుణావత్ మంగ్య, శ్రీను, వాంకుణావత్ సక్రు, వాంకుణావత్ నంద, వాంకుణావత్ మోహన్ తమ గొర్రెలకు హారన్ మోగించారని వారిపై రాళ్లతో దాడి చేసి ఇద్దరి బంగారు గొలుసులను లాక్కోవడంతో పాటు కారు, సెల్ ఫోన్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఆరుగురిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

చిరు ధాన్యాల సాగుతో అధిక లాభాలు

- పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్ సూచనలు

పెద్దవూర: వరి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు చిరు ధాన్యాల పంటలైన జొన్న, సజ్జ, రాగి, కొర్ర పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, అధిక లాభాలు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ తెలుపుతున్నారు. చిరుధాన్యాలు రక్త పోటు, మధుమేహం, ఎముకల పటుత్వ లేమి, ఊబకాయం సమస్యలతో బాధపడే వారికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.



పాడి పంట

సజ్జ

ఖరీఫ్‌లో సజ్జ పంటను జూన్ రెండో వారం నుంచి జూలై మూడో వారం వరకు విత్తుకోవచ్చు. రాష్ట్రంలోని అన్ని సజ్జను ఖరీఫ్‌లో సాగు చేస్తారు.

రకాలు: ఐసీఎంహెచ్ 356(హైబ్రీడ్), పీహెచ్‌బీ3, ఏహెచ్‌బీ 1 పేరున్న హైబ్రీడ్ రకాలను సాగుకు ఎంచుకోవాలి. ఎకరాకు 1.6 కిలోల విత్తనం వాడుకోవాలి. వరుసల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 45 సెంటీమీటర్లు దూరంలో విత్తుకోవాలి.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి కాప్టాన్ లేదా 3 గ్రాముల థైరామ్ కలిపి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: ఒక టన్ను పశువుల ఎరువుతో పాటు ఎకరాకు వర్షాధార పంటకు 24–12–8 చొప్పున, నీటి వసతి కింద 32–16–12 కిలోల చొప్పున నత్రజని–భాస్వరం–పొటాష్ ఎరువులను వేసుకోవాలి. నత్రజని ఎరువును రెండు దఫాలుగా పంట విత్తేటప్పుడు, విత్తిన 30 నుంచి 35 రోజులకు వేయాలి. రెండు సాళ్ల సజ్జ పంటకు ఒక సాలు కంది పంటను అంతర పంటగా వేసుకోవచ్చు. జొన్న పంటలో సూచించిన మాదిరి అట్రజిన్ కలుపు మందుతో కలుపును నివారించాలి. పంట కీలక దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. సజ్జ పంట 70 నుంచి 80 రోజులలో కోతకు వచ్చి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

రాగి : వానా కాలంలో రాగి పంటను జూలై నుంచి ఆగస్టు వరకు విత్తుకోవచ్చు. రాగి పంట 80 నుంచి 115 రోజులలో చేతికి వస్తుంది. స్వల్పకాలిక రకాలైన మారుతి, చంపావతి, 80 నుంచి 90 రోజుల్లో.., మధ్యకాల రకాలైన సప్తగిరి, భారతి, గోదావరి, 100 నుంచి 115 రోజుల్లో, పీపీఆర్ 1012 రకం 115 నుంచి 120 రోజులలో పంట కోతకు వచ్చి ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి ఇస్తాయి. రాగిని నేరుగా విత్తనాన్ని వెదజల్లి నారు పెంచి నాటే విధానంలో సాగు చేయవచ్చు. ఎకరాకు 2.5 కిలోల విత్తనం సరిపోతుంది.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తనాన్ని వరుసల మధ్య 15 నుంచి 20 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 15 సెంటీమీటర్లు దూరంలో విత్తుకోవాలి. నారుమడికి 640 గ్రాముల లెక్కన నత్రజని, భాస్వరం, 480 గ్రాముల పొటాష్ ఇచ్చే ఎరువులు వేసుకోవాలి. ప్రధాన పొలంలో నాలుగు టన్నుల పశువుల ఎరువులు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 12 కిలోలు నత్రజని, 8 కిలోల పొటాష్, 12 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువులు విత్తేటప్పుడు లేదా నాటేటప్పుడు వేసుకోవాలి. విత్తనాన్ని వెదజల్లేటప్పుడు భూమిని మెత్తగా తయారు చేసి విత్తనాన్ని సమానంగా చల్లుకోవాలి. విత్తనం చల్లిన తరువాత బల్లతో గాని, చెట్టు కొమ్మతో గాని చదును చేసుకోవాలి. విత్తిన వెంటనే మొలకలు రాక ముందు లీటర్ నీటిలో 3 మిల్లీ లీటర్లు పెండి మిథాలిన్‌ను కలిపి పిచికారీ చేయాలి. నాటిన 15 నుంచి 18 రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలు ఉంటే 2,4–డీ సోడియం సాల్టును రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుని కలుపు నివారించుకోవాలి.

కొర్ర : ఖరీఫ్ పంటగా కొర్రను జూలై, ఆగష్టు మాసాలలో విత్తుకోవాలి. కొర్ర పంట 70 నుంచి 85 రోజులలో కోతకు వస్తుంది. కొర్రలో ప్రసాద్, కృష్ణదేవరాయ, శ్రీలక్ష్మీ, సూర్యనంది, ఎస్ఐఏ 3085, ఎస్ఐఏ 3156 రకాలు అనుకూలం. పప్పు శనగకు ముందు 70–75 రోజులలో సూర్యనంది కొర్రలు సాగు చేసి శనగ వేసుకుంటే నికర ఆదాయం పెరుగుతుంది.

విత్తనశుద్ధి : ఎకరాకు సాళ్లలో విత్తేతే 9 కిలోలు, వెదజల్లే పద్ధతిలో 4 కిలోల విత్తనం వాడాలి. కిలో విత్తనానికి కార్బండిజం 2 గ్రాములు కలిపి విత్తన శుద్ధి చేసి సాళ్ల మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు ఎడం ఉండేలా విత్తుకోవాలి. విత్తిన 20 నుంచి 25 రోజులకు సాళ్లలో అంతర కృషి చేసి కలుపు నివారించాలి.

ఎరువుల యాజమాన్యం: ఎకరాకు రెండు టన్నుల పశువుల ఎరువు, 8 కిలోల నత్రజని, 17 కిలోల భాస్వరం వేసుకోవాలి. వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా తక్కువ నీటి వినియోగంలో ఉన్న చిరుధాన్యాల పంటలు ఎంచుకుంటే తక్కువ పెట్టుబడులతో అదాయాలు పొందవచ్చు.

జొన్న

వానాకాలంలో రాష్ట్రంలో జొన్న పంటను అన్ని జిల్లాలలో సాగు చేయవచ్చు. నల్లరేగడి, తేలికపాటి నేలలు జొన్న పంటకు అనుకూలం. ఖరీఫ్‌లో తొలకరి వర్షాలు కురవగానే వర్షపాతం ఆధారంగా జూన్ మొదటి వారం నుంచి జూలై చివరి వారం వరకు విత్తుకోవాలి. విత్తడం ఆలస్యమైతే కాండం తొలుచే పురుగు ఉధృతి పెరుగుతుంది.

రకాలు: హైబ్రీడ్ రకాలైన సీఎస్‌హెచ్ 14, 16, 18, 21 రకాలతో పాటు ప్రాచుర్యం పొందిన ప్రైవేటు కంపెనీల హైబ్రీడ్ రకాలను సాగు చేయవచ్చు. హైబ్రీడ్ రకాలలో ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి పొందవచ్చు. సాధారణ రకాలైన సీఎస్‌వీ 15, శ్రీశైల(పీఎస్‌వీ–56) రకాలు సాగు చేయవచ్చు. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

విత్తే విధానం: జొన్న సాగుకు ఎకరాకు 3 నుంచి 4 కిలోల విత్తనం వాడుకోవాలి. వరుసల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 12 నుంచి 15 సెంటీమీటర్ల దూరం ఉండేలా విత్తకోవాలి.

విత్తనశుద్ధి: విత్తే ముందు కిలో విత్తనానికి మూడు గ్రాముల థయోమీ థక్సం, మూడు గ్రాములు కాప్టాన్ లేదా థైరామ్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి.

ఎరువుల యాజమాన్యం: ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువుతో పాటు 32–24–18 కిలోలు చొప్పున నత్రజని–భాస్వరం–పొటాష్ ఎరువులు వేసుకోవాలి.

అంతర పంట: జొన్నలో కందిని అంతర పంటగా 2:1 నిష్పత్తిలో సాగు చేసుకోవచ్చు. విత్తిన 42 గంటల్లోపు లీటరు నీటికి 4 గ్రాములు అట్రజిన్ కలుపు మందును కలిపి పిచికారీ చేస్తే మొదటి దశలో వచ్చే కలుపును నివారించవచ్చు. జొన్నలో ఎక్కువ కష్టం కలిగించే మల్లె(కలుపు) నివారణకు లీటర్ నీటికి 50 గ్రాముల అమ్మోనియం సల్ఫేట్ లేదా 2.4–డి సోడియం సాల్ట్ 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.